సిగ్నల్స్ అందక ఇక్కట్లు..



కేజీ పూడిలో కొత్తగా ఏర్పాటు చేసిన బీఎస్ఎన్ఎల్ టవర్

వేపాడ: మండలంలోని పలు గ్రామాలకు సెల్‌ఫోన్ సిగ్నల్స్ రాక వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని బానాదిలో ఎయిర్‌టెల్ టవర్ ఉన్నప్పటికీ పక్కనే ఉన్న బల్లంకికి సిగ్నల్స్ అందడం లేదు. నెల రోజులుగా సిగ్నల్స్ అందక వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసరంగా ఎవరితోనైనా మాట్లాడాలంటే ఊరు బయటకు వచ్చి ఫోన్ చేసుకుని మళ్లీ ఇంటికి చేరుకోవాల్సి వస్తోందని వాపోతున్నారు. నీలకంఠరాజపురంలో బీఎస్ఎన్ఎల్.. బానాదిలో ఎయిర్‌టెల్ టవర్లున్నాయి. రెండు టవర్లకు మధ్యన్న బల్లంకి గ్రామానికి మాత్రం ఏ టవర్ సిగ్నల్ అందడం లేదు. అలాగే కొండగంగుబూడిలో కొత్తగా బీఎస్ఎన్ఎల్ టవర్ ఏర్పాటు చేశారు. అయితే ఇంతవరకు టవర్ ప్రారంభించకపోవడంతో కొండగంగుబూడి పరిసర ప్రాంతాల్లో సిగ్నల్స్ ఉండడం లేదు. దీంతో సచివాలయం, ఆర్ఎస్‌కే సిబ్బంది, నిత్యావసర సరుకులు ఇచ్చే డీలర్లు, స్కూల్ యాప్‌లో వివరాలు నమోదు చేసేందుకు ఉపాధ్యాయులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ఆయా టవర్ల యాజమాన్యాలు స్పందించి సిగ్నల్స్ అందేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇబ్బంది పడుతున్నాం..



గ్రామంలో ఏ నెట్‌వర్క్ సిగ్నల్ కూడా లేకపోవడంతో ఎవ్వరితోనూ మాట్లాడలేకపోతున్నాం..ఎటువంటి సమాచారం తెలుసుకోలేకపోతున్నాం. దాదాపు నెల రోజులుగా ఇబ్బంది పడుతున్నాం. బానాదిలో ఎయిర్‌టెల్ టవర్ ఉందని..ఎన్‌కేఆర్‌పురంలో బీఎస్ఎన్ఎల్ టవర్ ఉండడంతో రెండు సిమ్‌లు వినియోగిస్తున్నా సిగ్నల్స్ రావడం లేదు.

– మేడపాటి కిషోర్‌శర్మ, పురోహితుడు, బల్లంకి

సిగ్నల్స్ లేవు..



బల్లంకి గ్రామంలో సిగ్నల్స్ లేకపోవడంతో ఎటువంటి సమాచారం అందడం లేదు. నేను ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తుంటాను. కష్టమర్లు ఫోన్ చేసిన సిగ్నల్ లేక బేరాలు పోతున్నాయి. ఎవ్వరి నుంచి ఎటువంటి సమాచారం తెలుసుకోలేకపోతున్నాం.

– సారిక ఈశ్వరరావు, ఆటోడ్రైవర్, బల్లంకి

పంచాయతీ కార్యదర్శుల బదిలీల్లో రాజకీయం..



శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో.. కుళ్లిపోయిన రాజకీయాలతో.. పాలనలో భాగమైన రాజ్యాంగ వ్యవస్థలు కూలిపోతున్నాయి. 'ఎద్దు ఈనిందంటే ఎండన కట్టేయరా' అన్నట్టు కూటమి నేతలు సిఫార్సు చేసిందే తడవుగా కలెక్టర్ కూడా కనీసం ఆలోచన చేయకుండా రాజకీయ బదిలీలకు సిద్ధమవుతున్నారు. తాజాగా ఎస్.కోట, వేపాడ మండలాల పంచాయతీ కార్యదర్శులు ఆరుగురికి ఇచ్చిన ప్రత్యేక ఉత్తర్వులు ఈ కోవలోకే వస్తాయి.

● పైసల కోసం పైరవీలు..

కూటమికి చెందిన పార్టీ నేతకు కొందరు పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీర్ల బదిలీల విషయంలో పెద్ద మొత్తంలో సొమ్ములు చేరాయి. దీంతో ఎంపీ అండతో బదిలీల కోసం పట్టుబట్టారు. ఇదే సమయంలో కలెక్టర్ అంబేడ్కర్ కూడా పెద్దలు చెప్పినట్టే బదిలీ ఉత్తర్వులు ఇచ్చి స్వామి భక్తి చాటుకున్నారు. గతేడాది అక్టోబర్‌లో, ఈ ఏడాది జూన్‌లో పంచాయతీ కార్యదర్శుల బదిలీలు జరిగాయి. అప్పుడు అవసరం లేని బదిలీలు ఇప్పుడు ఎందుకు అవసరమయ్యాయో పెరుమాళ్లకే ఎరుక.

● అడ్డగోలు బదిలీలు..

గతంలో ఎస్.కోట మండలం వసి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన జి.శంకరరావును ఇటీవల వేపాడ మండలం జగ్గయ్యపేట పంపి, ఇప్పుడు ముషిడిపల్లికి బదిలీ చేశారు. ముషిడిపల్లి కార్యదర్శి అనిల్‌కుమార్‌ను జగ్గయ్యపేటకు బదిలీ చేశారు. వేపాడ మండలం పాటూరు కార్యదర్శి జి.అనిల్ కుమార్‌ను ఎస్.కోటలో కిల్తంపాలెంనకు.. కిల్తంపాలెం కార్యదర్శి పి.శంకరరావును పాటూరుకు, పంపారు. గతంలో మూలబొడ్డవర కార్యదర్శిగా పనిచేసిన ఎల్.బంగారునాయుడును గత అక్టోబర్‌లో తిమిడి పంపి, ఇప్పుడు తిరిగి మూలబొడ్డవరకు మార్చారు. వేపాడ మండలం బానాది ఇన్‌చార్జ్ కార్యదర్శి ఎ.ఎస్.ఎస్.ఎన్.మూర్తికి సర్పంచ్ యశోదకు మధ్య వివాదం నెలకొనడంతో ఆయన్ను గుమ్మలక్ష్మీపురానికి బదిలీ చేశారు. నాటి నుంచి బానాది పంచాయతీకి కార్యదర్శి లేరు. ఇప్పుడు మళ్లీ అదే వ్యక్తిని బానాది కార్యదర్శిగా నియామకం చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. పరిపాలనా సౌలభ్యం పేరుతో ప్రభుభక్తిని చాటిన కలెక్టర్ తీరు ఉద్యోగవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

పెట్రోల్ బంక్ పరిశీలన

సాక్షి ఎఫెక్ట్...



బంక్‌లో విచారణ నిర్వహిస్తున్న అధికారులు

చీపురుపల్లి: పట్టణంలోని మెయిన్‌రోడ్‌లో గల హెచ్‌పీ పెట్రోల్ బంక్‌ను తహసీల్దార్ డి.ధర్మరాజు నేతృత్వంలో అధికారులు శుక్రవారం తనిఖీ చేశారు. స్థానిక హెచ్‌పీ పెట్రోల్ బంక్‌లో గురువారం రాత్రి పెట్రోల్ పోయించుకుంటే నీరు వచ్చిందని పలువురు వినియోగదారులు ఆందోళన చేయడంతో సాక్షి పత్రికలో 'పెట్రోల్‌లో నీరు' శీర్షికన శుక్రవారం కథనం ప్రచురితమైంది. దీంతో తహసీల్దార్ డి.ధర్మరాజు, సీఎస్‌డీఓ నాగలక్ష్మి నేతృత్వంలోని అధికారుల బృందం బంక్‌ను తనిఖీ చేసి పెట్రోల్ సాంద్రత, నిల్వలను పరిశీలించారు. అనంతరం వినియోగదారులతో మాట్లాడగా.. పెట్రోల్‌లో నీరు వస్తున్నమాట వాస్తవమేనని బదులిచ్చారు. నివేదికను ఉన్నతాధికారులకు తెలియజేస్తామని అధికారులు చెప్పారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి

● జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



పంచాయతీ కార్యాలయ భవనం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, తదితరులు

శృంగవరపుకోట: రాజకీయాలకతీతంగా గ్రామాల్లో అభివృద్ధి జరగాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వసి గ్రామంలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలు, ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.7 లక్షలు, పంచాయతీ నిధులు రూ. లక్షతో కలిపి 13 లక్షల రూపాయలతో నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామాల్లో కావాల్సిన మౌలిక సౌకర్యాల కల్పనకు రాజకీయాలు ఊతమివ్వాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు ఎం.వెంకటలక్ష్మి, సర్పంచ్ ఒబ్బిన పార్వతి, వైస్ ఎంపీపీ పినిశెట్టి వెంకటరమణ, తిమిడి సర్పంచ్ ఒబ్బిన త్రినాథమ్మ, ఎంపీటీసీ సభ్యుడు పదాల ధర్మారావు, ఎంపీడీఓ సతీష్, ఈఓపీఆర్‌డీ లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్రషర్ నిలిపివేయాలి

● మాధవరాయి మెట్ట కాలనీవాసులు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

జామి: మండల కేంద్ర సమీపంలోని మాధవరాయి మెట్టకాలనీ వద్దనున్న స్టోన్ క్రషర్ వల్ల తామంతా టీబీ, కిడ్నీ వ్యాధులకు గురవుతున్నామని, వెంటనే క్రషర్‌ను నిలిపివేయాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈమేరకు సీపీఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ముందుగా కాలనీ నుంచి తహసీల్దార్ కార్యలయం వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ, క్వారీ పేలుళ్ల వల్ల గృహాలు దెబ్బతింటున్నాయని చెప్పారు. అలాగే దుమ్ము, ధూళి వల్ల రోగాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. క్రషర్‌ను మూసి వేసేవరకూ ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. దీంతో క్రషర్ యజమానులను పిలిపించి తహసీల్దార్ కృష్ణంరాజు, ఎస్సై వీర జనార్దన్ చర్చించారు. క్రషర్ లైసెన్స్, తదితర పత్రాలు సోమవారం తీసుకువచ్చి చూపించాలని అధికారులు సంబంధిత యజమానులను ఆదేశించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకుడు గాడి అప్పారావు, న్యాయవాది బి.రమణారావు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



నియామక పత్రాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ బూత్ ఇన్‌చార్జ్ చందు

బొండపల్లి: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కొత్తగా నియమించిన నాయకులు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ బూత్ ఇన్‌చార్జ్ తాడ్డి చందు అన్నారు. మండలంలోని కనిమెరక గ్రామంలో పార్టీ అనుబంధ రంగాలకు నాయకులను నియమించి వారికి శుక్రవారం నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ గ్రామ అధ్యక్షుడిగా సిరిపురం ఆదినారాయణతో పాటు వివిధ విభాగాలకు అధ్యక్షులు, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బొబ్బిలి శ్రీను, నాయుడు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

గంట్యాడ: రోడ్డు ప్రమాదంలో ఓ అంగన్‌వాడీ కార్యకర్తకు తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని దిగువ కొండపర్తి పంచాయతీ పరిధిలోని భీమవరం గ్రామానికి చెందిన కె. రాజేశ్వరి అనే అంగన్‌వాడీ కార్యకర్త శుక్రవారం గంట్యాడలో జరిగిన ఐసీడీఎస్ సమావేశానికి హాజరైంది. సమావేశం అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి గ్రామానికి వెళ్లిపోతుండగా.. తామరాపల్లి వద్ద అదుపు తప్పి కిందపడిపోయింది. దీంతో తలకు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు ఆమెను 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రికి తరలించారు.

తడి, పొడి చెత్తను వేరు చేయాలి



జాగరంలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ సత్యనారాయణ

జామి: తడి, పొడి చెత్తను వేరు చేసి అందించాలనే విషయమై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని జెడ్పీ సీఈఓ బి.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని జాగరం గ్రామాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా తాగునీటి ట్యాంక్‌ను పరిశీలించి, క్లోరినేషన్‌పై సిబ్బందికి పలు సూచనలు చేశారు. పారిశుధ్య పనులు పక్కాగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వి.నరసింహులు, ఈఓపీఆర్డీ బి.ఉమా, పంచాయతీ కార్యదర్శి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి

దత్తిరాజేరు: మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని ఉద్యానవన శాఖాధికారి దీప్తి అన్నారు. మండలంలోని చినకాద సచివాలయంలో చినకాద, కన్నాం గ్రామాల రైతులకు వివిధ పంటల సాగుపై అవగాహన కల్పించారు. ఆయిల్‌పామ్ సాగు చేస్తే 50 శాతం రాయితీపై బోరు సదుపాయం కల్పిస్తామన్నారు. మొక్కలు కూడా ఉచితంగా అందజేస్తామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అంతరపంటల సాగుకు నగదు సాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ బాలకృష్ణ, ఫీల్డ్ మేనేజర్ నవీన్ పాల్గొన్నారు.

క్వారీ బుగ్గితోనే సరి..



క్వారీ బుగ్గితో మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

దత్తిరాజేరు: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గొభ్యాం కూడలి వద్ద రోడ్డు కోతకు గురై వాహనదారులు ఇబ్బంది పడిన విషయం తెలిసిందే. ఈ విషయమై పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడంతో అధికారులు క్వారీ బుగ్గితో తూతూమంత్రంగా శుక్రవారం పనులు చేపట్టి చేతులు దులుపుకున్నారు. దీంతో ఇవేం పనులంటూ స్థానికులు పెదవివిరుస్తున్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ, వల్లంపూడి గ్రామాల్లో గల ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టాకు, రికార్డులను పరిశీలించారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో సీఐ బి.సింహాచలం, హెచ్‌సీ కామేశ్వరరావు, పీసీ పురుషోత్తం, ఏఓ స్వాతి, ఏఈఓ అక్కునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

యూరియా కొరతపై నిలదీత



వ్యవసాయాధికారులను ప్రశ్నిస్తున్న ప్రజాప్రతినిధులు

● మండల సర్వసభ్య సమావేశంలో అధికారుల తీరుపై మండిపడిన సభ్యులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలో వెదుళ్లవలస ఓ పెద్ద పంచాయతీ. పంచాయతీ పరిధిలో 1500 మంది రైతులుండగా 260 యూరియా బస్తాలను పోలీసుల సమక్షంలో వ్యవసాయాధికారులు పంపిణీ చేశారు. మిగతా రైతుల పరిస్థితి ఏమిటి.. యూరియా ఇస్తారో, ఇవ్వరో చెప్పరు.. ఖరీఫ్ సీజన్ ముగిసిపోయాక ఇస్తే ఏమి ప్రయోజనమని వెదుళ్లవలస పంచాయతీ సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడుతో పాటు పలు పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వ్యవసాయశాఖ ఏడీఏ ఎస్.కోటీశ్వరరావు, ఏఓ పి. ప్రసాదరావులను నిలదీశారు. గరివిడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ మీసాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమీక్షలో వ్యవసాయాధికారులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఖరీఫ్‌లో 6449 ఎకరాల్లో వరిసాగు, 2598 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోందన్నారు. ఇందుకు సంబంధించి మొదట విడతలో 291 మెట్రిక్ టన్నుల యూరియా సరిపోవాల్సి ఉండగా, 417 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేశామని తెలిపారు. దీంతో పలువురు ప్రజాప్రతినిధులు కలుగజేసుకుని 417 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా చేస్తే రైతులకు యూరియా ఎందుకు అందలేదని ప్రశ్నించారు. ఒక్క బస్తా కోసం ఎండలో అన్నదాతలు నిల్చుంటున్న విషయం మీకు తెలియదా అని మండిపడ్డారు. చాలా చోట్ల బ్లాక్‌మార్కెట్‌లో యూరియా కొనుగోలు చేయాల్సి వస్తోందని చెప్పారు. అనంతరం పలు సమస్యలపై సమీక్షించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ రేగాన రామారావు, వైస్ ఎంపీపీలు జి.శ్రీరామలునాయుడు, జి.రామకృష్ణరాజు, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ జి.మధుసూదనరావు, అన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

దాడి చేశారంటూ ఫిర్యాదు

శృంగవరపుకోట: తనపై గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారంటూ టీ దుకాణం నిర్వాహకుడు వెన్నెల రాజేష్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుకు సంబంధించి సీఐ నారాయణమూర్తి మాట్లాడుతూ..శుక్రవారం తెల్లవారుజామున ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి చాకుతో దాడి చేశారని రాజేష్ ఫిర్యాదు చేశాడన్నారు. అయితే దాడి జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వకుండా, ఆస్పత్రిలో చేరడం, వీడియోలు రికార్డు చేసి మీడియాకు ఇవ్వడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. రాజేష్ గతంలో దేవీ గుడి ఎదురుగా పూలమ్మే మహిళ వద్ద బంగారు చైన్ తీసుకుని తాకట్టు పెట్టాడన్నారు. దీంతో ఆమె ఫిర్యాదు చేయడంతో రాజేష్‌ను పలు మార్లు స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టగా.. శుక్రవారం రూ. 1.20 లక్షలు ఇస్తానని ఒప్పుకున్నాడని తెలిపారు. ప్రస్తుతం ఆమే తనపై దాడి చేయించిందని రాజేష్ చెప్పగా.. గడువుకు ముందు ఆమె ఎందుకు దాడి చేయిస్తుందని ప్రశ్నించడంతో స్టేషన్ నుంచి హడావిడిగా వెళ్లిపోయాడని సీఐ తెలిపారు. ఏది ఏమైనా రాజేష్ ఫిర్యాదుపై విచారణ చేపడతామన్నారు.

వన్‌బీలు రావడం లేదు



మాట్లాడుతున్న తహసీల్దార్ సులోచనారాణి

మెరకముడిదాం: ప్రభుత్వం తమకు ఇచ్చిన డీపట్టా భూములకు సంబంధించి ఆన్‌లైన్‌లో వివరాలు లేనందున వన్‌బీలు రావడం లేదని కొండలావేరు గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ రైతులు తహసీల్దార్ సులోచనారాణి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామంలో మండల సర్వేయర్ ఖాదర్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమ భూములకు సంబంధించి వన్‌బీలు రాకపోవడంతో ప్రభుత్వ పథకాలు, ఆర్థిక సాయం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తహసీల్దార్ స్పందిస్తూ, డీపట్టా భూములను ప్రభుత్వం ఫ్రీ హోల్డ్‌లో ఉంచిందని.. అందుకే వన్‌బీలు రావడం లేదని చెప్పారు. ఫ్రీ హోల్డ్ నుంచి తొలగించిన వెంటనే భూముల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసి వన్‌బీలు వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల్లేవు..

మెరకముడిదాం: నిన్న, మొన్నటి వరకు అరకొరగా పంపిణీ చేసిన ఎరువులు ఇప్పుడు పూర్తిగా నిండుకున్నాయని వ్యవసాయశాఖాధికారులే చెబుతుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇచ్చేదే ఒక బస్తా..దానికి కూడా సరపడా స్టాకు లేదని అధికారులు చెప్పడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటివరకు పీఏసీఎస్‌లు, రైతుసేవా కేంద్రాల ద్వారా ఎరువులను పంపిణీ చేసినప్పటికీ రైతులకు సరపడా ఎరువులను ప్రభుత్వం అందించలేదు. దీంతో రైతులు ఎరువులు ఎక్కడ పంపిణీ చేసినా పరుగులెట్టి, ఒక బస్తా యూరియా కోసం గంటల తరబడి క్యూలో నిల్చొంటున్నారు. ఇటీవల స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రత్యేకాధికారి మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎరువుల కొరత లేదని చెప్పిన వ్యవసాయాధికారులు ఇప్పుడు స్టాకు లేదని చెప్పడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మెడిటేషన్ సెంటర్ ప్రారంభం



మెడిటేషన్ కేంద్ర ప్రారంభోత్సవంలో పాల్గొన్న బ్రహ్మకుమారి సునీత, తదితరులు

వేపాడ: మండల కేంద్రంలో బ్రహ్మకుమారీస్ మెడిటేషన్ సెంటర్‌ను బ్రహ్మకుమారి సునీత శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సెంటర్‌లో ఉచితంగా ధ్యానం నేర్పిస్తామని, ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. ధ్యానంతో మనస్సు ప్రశాంతంగా ఉంటుందని చెప్పారు.

రాష్ట్రస్థాయి పోటీలకు జామి విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన జామి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ఉపాధ్యాయులు

జామి: రాష్ట్ర స్థాయి ఆటల పోటీలకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం ఎస్‌వీ శేఖర్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ఆవరణలో శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 10,11 తేదీల్లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారని చెప్పారు. రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఇద్దరు.. టేబుల్ టెన్నిస్‌కు ఇద్దరు.. పెట్‌బాల్ పోటీలకు ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం శేఖర్‌కుమార్తో పాటు పీడీలు ఆనంద్, ఎర్నమ్మ, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

ఫుట్‌బాల్ పోటీలకు..

లక్కవరపుకోట: మండలంలోని చందులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ డాక్టర్ పొట్నూరు శ్రీరాములు తెలిపారు. విజయనగరం జిల్లా కేంద్రంలో గురువారం జరిగిన ఎంపికల్లో బాలుర విభాగంలో చొప్ప దేవేంద్ర, బాలికల విభాగంలో భూమిరెడ్డి కావ్య, కిలపర్తి, కర్రి ఎర్నిరుచితలు ఎంపికయ్యారని చెప్పారు.



శృంగవరపుకోట: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో సిబ్బంది

ఐదుగురు విద్యార్థులు..

శృంగవరపుకోట: మండలంలోని భవానీనగర్ వద్ద ఉన్న డీవీఎల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఐదుగురు ఈనెల 13న విశాఖలో జరగనున్న టార్గెట్‌బాల్ టోర్నమెంట్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ వై.జానకీదేవి తెలిపారు. ఈ మేరకు విద్యార్థులు ఎం.పారున్ షైనీ, బి.అనురాధ, కె.దేవీశ్రీప్రసాద్, డి.హర్షవర్ధన్‌లను అభినందించారు.

రైల్వే ట్రాక్‌పై నడవడం ప్రమాదకరం



మంగళపాలెం సమీపంలో అవగాహన కల్పిస్తున్న ఆర్పీఎఫ్ ఎస్సై ధర్మవతి

కొత్తవలస: రైల్వే ట్రాక్‌లపై నడవడం ప్రమాదకరమని ఆర్పీఎఫ్ ఎస్సై బి.ధర్మవతి తెలిపారు. మండలంలోని మంగళపాలెం జంక్షన్ సమీపంలో గల పాత రైల్వే గేట్ వద్ద శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వెళ్తున్న రైళ్లపై కొంతమంది ఆకతాయిలు రాళ్లు రువ్వుతున్నారని.. ఈ విధంగా చేయడం చట్టరీత్యా నేరమన్నారు. అలాగే రైళ్లలో ప్రయాణించే సమయంలో ఫుట్‌బోర్డుపై కూర్చోవడం ప్రమాదకరమని చెప్పారు. రైల్వే ట్రాక్‌లపై నడిచి ప్రమాదాలను కొని తెచ్చుకోవద్దని హితవు పలికారు. కార్యక్రమంలో ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుళ్లు పీఎస్ రావు, కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

కొనసాగుతున్న యూరియా కష్టాలు



గుర్ల: కోటగండ్రేడులో యూరియా కోసం వేచివున్న రైతులు



దత్తిరాజేరు: పెదమానాపురం గ్రామ సచివాలయం వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు

గుర్ల/దత్తిరాజేరు: రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. బస్తా యూరియా కోసం బారులు తీరాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. గుర్ల మండలం కోటగండ్రేడులోని ప్రైవేట్ డీలర్‌కు శుక్రవారం యూరియా లోడ్ వచ్చిందని తెలియడంతో రైతులు పెద్ద ఎత్తున చేరుకున్నారు. కోటగండ్రేడు, చింతలపేట, కలవచర్ల, గుర్ల, గోషాడ, ఆనందపురం, గరికివలసకు చెందిన రైతులు ఒక్కసారిగా రావడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. అలాగే దత్తిరాజేరులో కూడా రైతులు యూరియా కోసం ఇబ్బంది పడుతున్నారు. పెదమానాపురం సచివాలయం వద్ద రైతులు వన్‌బీ, పాస్ పుస్తకాలు చూపిస్తూ అధికారులు యూరియా కోసం స్లిప్పులు పంపిణీ చేశారు.